# విముక్తి

శివరాత్రి ఉపవాసం వుండి అప్పుడే రెండు పళ్ళతిని మడిగా కూర్చుని వత్తులు చేసుకుంటున్న సావిత్రమ్మ కొడుకు చెప్పినమాట విని నిశ్చేష్టురాలయి చూసింది ముందే ఊహించిన సంగతి అయినా.

"హా!" అంతకన్న ఆమెనోట మాట రాలేదు.

హరిమోహన్ చెప్పదలచింది అంతా చెప్పేసి నెమ్మదిగా బయటి వెళ్లిపోయాడు.

గురిచూసి ఎక్కడ కొట్టాలో అక్కడ బాణం వదిలాడు హరి. ఒక్కగా నొక్క కొడుకుని తండ్రి పోయినదగ్గరనించి అపురూపంగా పెంచి ప్రాణాలన్నీ వాడిమీదే పెట్టుకున్న కొడుకుని తన స్వార్థానికి, సంతోషానికీ ఏతల్లీ బలిచెయ్యదు. పరువు, ప్రతిష్ఠలకోసం వంశగౌరవంకోసం తన వంశమే నిర్వంశం చేసుకోవడం ఏతల్లీ కోరదు.

కొడుకు తత్వం తెలిసిన ఆమెకి అతని మాటల్లో అతిశయోక్తి ఏది కనబడలేదు.

ఈ పెళ్ళి అంగీకరించడం మినహా వేరే గత్యంతరంలేదు. తను కాదంటే తనమాట జవదాటడు. కాని అన్నమాటమీదే విలబడి ఇంకెవ రినీ పెళ్ళాడడు. హరి పట్టుదల పంతం ఎలాంటివో ఆమెకు బాగాతెలును.

భగవంతుడా! ఎలాంటిస్థితి తెచ్చిపెట్టావు నాకు. కుమిలిపోయిందా తల్లి. పొద్దుచూడందే పచ్చిగంగ ముట్టక నెలకి ఇరవై రోజులు శనివా రాలు, ఆదివారాలు. ఏకాదశులు పౌర్ణమి అంటూ ఉపవాసాలుంటూ, తెల్లారి నాలుగు గంటలకి లేచి స్నానం, జపం, పారాయణ, ధూపదీప నైవేద్యా లతో దేముడికి పూజచేస్తూ తనచేత్తో యింత మడిగా వుడకేసుకుతి టూ మడి ఆచారాలు పాటించే సావిత్రమ్మకి ఆంగ్లో ఇండియన యువతి కోడ లుగా రాబోతూంది.

శుద్ధ శ్రోత్రియ బ్రాహ్మణ వంశంలో పుట్టి బ్రాహ్మణత్వం అక్షరాలా పాటించి జపం, తపం, సంధ్యావందనం ఏనాడూ నిర్లక్ష్యంచేయని నిత్యాగ్ని హోత్రం ఇంటవుండే తాత, తెల్లదొరలక్రింద ఉద్యోగం చేసినా ఏనాడూ సంప్రదాయాలని మరచిపోకుండా మడిగా తప్ప ఔపోసన పట్టని తండ్రి అలాంటి ఇంట పుట్టిన హరి ఈనాడు తమ కులం, మతం గాని పిల్లని ఈ యింటికోడలు చేయబోతున్నాడు.

ప్రాజ్ఞుడైన కొడుకుని ఆతల్లి ఏమని మందలించగలదు! రోజులు మారాయి. కాలానికి అనుగుణంగా తను సరిపెట్టుకోవాలని ఇన్నాళ్ళుగా హరి ఏంచేసినా సహించింది. కొడుకు సూటుబూటుతో కూర్చున్నా పాచి నోట కాఫీ త్రాగినా, టేబిల్ మీల్సు కావాలన్నా, యితర జాతులవారి సరసన భోజనం చేస్తున్నా .. యింట్లో తన ఎదురుగానే సిగరెట్టు కాల్చినా యితర జాతులవారి ఇళ్ళకి భోజనాలకి వెళ్ళినా, పార్టీలలో మద్యం సేవిస్తున్నా

డని తెలిసినా ఒకటి రెండు సార్లు హెచ్చరించడం మినహా ఏం చెయ్య లేకపోయింది. తన మాటలని చాదస్తంగా లెక్కకట్టి తేలిగ్గా త్రోసి పారేసే కొడుకుని ఏం చెయ్యలేక రోజులు మారాయి అనుకుని నిష్ఠ నియమాలు తనతోనే సరిపుచ్చుకుంది.

ఇదీ అంతేనా! ఇదీ టేబిల్‌మీల్స్, బెడ్‌కాఫీ, డిన్నరు పార్టీల లాంటిదేనని సంపుచ్చుకునేటంత తేలిక వ్యవహారమేనా! యింటికోడలిగా యింకోజాతి, మతం కోడలిని తెచ్చుకోడం అంత తేలిక వ్యవహారమేనా, తేలిక కాకపోయినా ఆమె ఏం చేయగలదు? కొడుకు నిర్ణయాన్ని మార్చే శక్తి ఆమె కెక్కడుంది.

మతం మార్చుకుంటుందని, మత్స్య మాంసాలు ముట్టదని, తల్లి ఆచార వ్యవహారాలలోగాని ఇంటి వంటవడ్డన సంగతిలోగాని భార్యకల్పించు కోదని, అంతా పూర్వంలాగే జరుగుతుందని కొడుకు తల్లికి హామీ ఇచ్చాడు.

పుట్టిన పాతికేళ్ళకి కాగితంమీద మతం మార్చుకున్నంత మాత్రాన ఆమె రక్తంకూడా మారిపోతుందా? అని అడుగలేకపోయింది, సావిత్రమ్మ. ఒకే యింట్లో వుంటూ నా మడి, నా నిష్ఠ, నియమాలు ఎలా మామూలుగా ఆచరించగలను? అని అడగాలనివున్నా అడగలేకపోయింది సావిత్రమ్మ.

ఈ స్థితి రాబోతుందని, కొడుకు యిలాంటి పని చేయబోతున్నా డని, యిలాంటి పరిస్థితి ఎలా ఎదుర్కోవాలా అని సావిత్రమ్మ యిన్ని రోజులుగా భయపడుతూనే వుంది.

డాక్టరు పరీక్ష పాసయి క్రొత్తగా ప్రాక్టీసుపెట్టిన హరి మా ప్రొఫెసర్ గారమ్మాయి "రోజ్‌లీ" అంటూ లేడీ డాక్టరుని తీసుకొచ్చి పరి

చయం చేసినరోజున రోజ్‌లీ రోజారంగు, ఆమెఅందచందాలను, తెలుగు మట్లాడే ఆ మాటల్లోనిస్వచ్ఛతనీ, ఆమె అందాన్ని, పొందికని అణుకువని ఆ రోజు ఎంతో మెచ్చుకుంది సావిత్రమ్మ. "చెప్పకపోతే బ్రాహ్మణ పిల్ల కాదనే తెలియదు" అనుకుంది. ఇండియన్ తండ్రికి, అమెరికన్ తల్లికి పుట్టి ఆంధ్రప్రదేశంలోనే వుండిపోయిన కుటుంబంలోని రోజ్‌లీ, తెలుగు స్వచ్ఛంగా మాట్లాడగలగడంలో వింతలేదు. రోజులు గడిచిన కొద్ది రోజ్‌లీ, హరిల మధ్య స్నేహం ఏ రూపు దాలుస్తుందో, రోజ్‌లీ సమక్షంలో హరి మొహంలో తళుకూ, కన్నులలో మెరుపూ గుర్తించ లేనంత వెర్రిది. చిన్నది కాదు సావిత్రమ్మ, ఇద్దరి పరిచయం ఏ రూపు దాల్చబోతూందో ఊహించి భయపడింది. కాని ప్రాజ్ఞుడైన కొడుకుని ఏమని వారించాలో తెలికయ, భర్త పోయిందగ్గరనుంచి మంచి చెడ్డా చూస్తున్న అన్నగారిని పిలిచి సంగతి చెప్పింది. ఆయన బాగా ఆలోచించి మేనల్లుడుకి పెళ్ళిఏర్పాట్లు మొదలుపెట్టాడు. కాని ఆయన మాట హరి లెక్కచేయక పోవడంతో తన పెద్దరికం చెల్లలేదని కోపగించి ఇంటా వంటా లేని అప్రాచ్యపు పనులు చేయవద్దని మేనల్లుడిని మందలించి వెళ్ళిపోయాడు ఆయన. యింక కొడుకు నోటినుంచి వినబోయే వార్తకోసం ప్రాణాలుగ్గబెట్టుకుని నిరీక్షించడం మినహా ఏం చెయ్యలేకపోయింది సావిత్రమ్మ.

తీరా కొడుకు అంతా చెప్పి ఆవిడ మాట్లాడ వీలులేకుండా నోరు మూశాడు.

నిప్పులాంటి వంశ ప్రతిష్ట మంటలో కలిసి పోతూందని మధన పడుతూ ఏనాడో చనిపోయిన భర్తని తలుచుకుని కంటనీరు పెట్టుకుంది సావిత్రమ్మ. ఆ తల్లి ఆవేదనని అర్థం చేసుకున్నట్లు ఓదార్పుగా చూసింది ఆయన పాత ఫొటో.

o o o

మెడలో పూలదండలతో, చేతుల్లో పూల గుత్తులతో కొడుకు, కోడలువచ్చి పాదాలంటి నమస్కరిస్తూంటే అప్రయత్నంగా ఒక అడుగు వెనక్కివేసింది సావిత్రమ్మ-ఏదో అంటరాని వస్తువును చూసినట్లు! వెం

టనే నిలద్రొక్కుకుని కొడుకు నెత్తిన చేయిపెట్టికోడలిని మాత్రం మన స్సులోనే ఆశీర్వదించింది.

సూటు బూటుతోవున్న కొడుకుని మొఖాన బొట్టయినా లేకుండా వున్న రోజ్‌లీని చూస్తుంటే "ఏం పెళ్ళి యిది. మొఖాన్ని కుంకుమ అయినా లేని పెళ్ళి ఏం పెళ్ళి? మంగళ సూత్రాలు, మధుపర్కాలు లేక పోయినా కనీసం నుదుట కుంకుమ అయినా లేకుండా నిల్చున్న రోజ్‌లీని చూస్తే సావిత్రమ్మకి ఎంతో అమంగళం అనిపించింది. భరించలేక గిరు క్కున తిరిగి లోపలికి వెళ్ళి దేముడి ముందు కుంకుమ తెచ్చింది. "హరీ! ఈ కుంకుమతో కోడలి మొహాన బొట్టుంచు నాయనా" "అమ్మా రోజా ఈరోజునించి నీవు బొట్టుపెట్టుకోవాలమ్మా మాలో స్త్రీకి బొట్టులేకపోతే చాలా తప్పు" అంది తిరిగి.

"అలాగేనండి!" వినయంగా అంది నవవధువు సిగ్గుదొంతర్లమధ్య. హరి, తల్లి ఛాదస్తానికి నవ్వుతూ గులాబిరంగు నుదుటిపై ఎర్రటి కుంకుమ దిద్దాడు. బొట్టు పెట్టుకున్నాక కొత్త మొహానికి కళరావడంచూసి సంతృప్తి పడింది సావిత్రమ్మ.

ఆ సాయంత్రం హరి పెద్ద రిసెప్షన్ ఏర్పాటుచేశాడు. తన వివాహ సందర్భంలో. ఊర్లోని పెద్ద పెద్ద వారందరూ హాజరయిన ఆ పార్టీ సావిత్రమ్మని మాత్రం సంతృప్తిపరచలేక పోయింది. ఏం పెళ్ళి! ఏం విందు! పసుపు బట్టలతో, కర్పూరపు దండలతో కళకళలాడే కొడుకూ, కోడల్నీ చూసుకునే అదృష్టం తనకి లేదు. కొత్తకోడల్ని నట్టింట గృహప్రవేశం చేయించి నలుగురి ముత్తయిదువులని పిలచి, నలుగురినీ పిలచి భోజనం పెట్టి, ముద్దు ముచ్చటా తీర్చుకోడానికి తను నోచుకోలేదు. ఇంతే రాసిపెట్టివుంది తన మొహాన. ఒక్కగా నొక్క కొడుకు పెళ్ళి ఎంత వైభవంగా చేద్దామనుకుంది. ఆఖరికి కులం మతం గాని పిల్లతో ఆఫీసుకెళ్ళి పెళ్ళిచేసుకు చక్కా వచ్చాడు.

అన్నివిధాలా ఆ పెళ్ళి ఆమెలో అసంతృప్తిని రేకెత్తించినా తన ఆవేదన తనలోనే అణచుకుంది సావిత్రమ్మ కొడుకు సుఖాన్ని కాంక్షించి!

రోజ్‌లీ ఎంత మంచిదైనా, ఎంత అణుకువగలదైనా సావిత్రమ్మకి ఇంకోజాతి కోడలుతో ఒకేయింట్లో వుంటూ తన ఆచార నియమాలు, నిష్ట కాపాడుకోవడం అంటే రోజూ దినదినగండం అనిపించసాగింది.

హరి పెళ్ళికిముందే చెప్పడంవల్ల రోజ్‌లీ అత్తగారి వంట, వంటిల్లు వగైరా విషయాలలో చాలా జాగ్రత్తగానే వుండేది. యింటిబాధ్యత అంతా సావిత్రమ్మ చేతిమీదుగానే యధాప్రకారం జరుగుతూంది.

కాని రోజ్‌లీ, హరి చెప్పినాకూడా కేవలం సదుద్దేశంతోనే అత్తగారికి సాయంచేసి ఆమె అభిమానానికి పాత్రురాలవడానికి, ఆమెని సంతుష్టి పరచాలన్న ఉద్దేశంతో, ఏనాడూ పని పాటలు అలవాటులేక పోయినా, చిన్న చిన్న పనులు చేసేది. ఆమెని సంతృప్తి పరచడానికి బదులు ఆమెకి ఓ సమస్యగా తయారయ్యేది.

మడి, ఆచారం, నిష్ట, నియమం, బ్రాహ్మణ్యం అన్న పదాలకి అర్ధమే తెలియని రోజ్‌లీ తనకు తెలియకుండానే కొన్ని కొన్ని పొరపాట్లు చేసేది.

తోమిన గిన్నెలు, తొలుచుకుంటున్న అత్తగారి చేతుల్లోంచి చెంబు అందుకుని "ఈ పనులుకూడా మీరే చెయ్యాలా—దీనికి మడి లేదుగా" అంటూ గిన్నెలు కడుగుతున్న కోడలిని తెల్లబోయి చూడడం మినహా ఏమనలేక పోయేది సావిత్రమ్మ. చచ్చినట్లు మళ్ళీ తలార స్నానం చేసేది. అత్తగారు ఎందుకు స్నానం చేసేదోకూడా తెలుసుకోలేకపోయేది రోజ్‌లీ.

అత్తగారు మడిగా ఆరేసుకున్న చీర వర్షం వస్తుందని జాగ్రత్తగా తెచ్చి లోపల పెట్టే కోడల్ని ఏమంటుంది? మర్నాడు తడి బట్టతో వండుకోవడం మినహా.

నీళ్ళు అయిపోతే లోపల బిందెలో పెట్టిన నీళ్ళు ముంచుకు త్రాగే కోడలిని వద్దని ఎలా అనగలుగుతుంది? ఆ నీళ్ళన్నీ పారబోసి మళ్ళీ మడిగట్టుకుని పట్టిపెట్టుకునేది. అవును, ప్రతిదానికి చిన్న పిల్లలని

మందలించినట్లు ఎలా మందలిస్తుంది సావిత్రమ్మ? కోడలిని తనతో సమానంగా సర్వాధికారాలు వున్న కోడలిని అన్నింటికి ఆంక్షలు ఎలా పెడుతుంది। అందులో ఇలాంటి సున్నిత విషయాలలో,

కూర తరిగియ్యనా. పక్కగ త్రిప్పనా, వంటిల్లు కడగనా అనే కోడలిని వారించడానికి నానా యాతన పడేది సావిత్రమ్మ. "నీకెందుకులే అమ్మా, నే నున్నాగా— నీ పని చూసుకో. హరి కేంకావాలో చూసుకో. ముగ్గురు మనుష్యుల పనికి నీ సాయం కూడా ఎందుకు" అంటూ ఏదో చెప్పేది. చాలాసార్లు అలా అనడంలో అర్థం రోజ్‌లీకూడ గుర్తించి "ఈ పనులకికూడా నేను పనికిరానంత హీనమా. నేనూ మీ మతం తీసు కున్నానుకదా," చిన్నపుచ్చుకున్న మొహంతో అమాయకంగా అడిగే రోజ్‌లీ మొఖంచూసి నొచ్చుకునేది సావిత్రమ్మ. కాని ఏం జవాబు చెబు తుంది. ఇలాంటి స్థితి తెచ్చిపెట్టిన కొడుకుమీద మనసులో కోపగించు కునేది.

కోడలు అందం, కోడలు సహృదయత, సౌమ్యతచూసి "రోజ్‌లీ గనక బ్రాహ్మణపిల్ల అయివుంటే—యిలాంటి కోడల్ని నెత్తిన పెట్టు కునేదాన్ని కదా!" అనిపించేది సావిత్రమ్మకి.

కాని తన జాతి, మతం కాకపోవడం రోజ్‌లీ తప్పా! దానికోసం ఆమెని నీచంగా, హీనంగా చూసే హక్కు తనకేముంది అని ఆత్మవిమర్శ చేసుకునేది ఒకోసారి సావిత్రమ్మ.

కాని ఆమె పుట్టి పెరిగిన వాతావరణం, యాభై యేళ్ళుగా అలవడిన అలవాట్లు పాటిస్తున్న ఆచారాలు ఒక్కసారిగా కోడలికోసం ఆమెమాత్రం అంత తేలిగ్గా ఎలా వదిలేసుకోగలదు!

కోడలు వచ్చాక యిరుగింటి పొరిగింటి సుబ్బమ్మ, లక్ష్మమ్మ వగైరాలు గడప త్రొక్కడం మానేశారు. రోజూ కలసి పురాణం చదువు కోడానికి, వత్తులు చేసుకోడానికి వచ్చేవాళ్ళు రావడం మానినా నిట్టూర్చి వూరుకుంది. తనని చూసి వాళ్ళు నవ్వుకోడం చూసినా సహించింది. వూళ్ళోవాళ్ళ గుసగుసలు భరించండి. బంధువర్గం సంబంధాలు తెంపుకుని

నిష్ఠూరాలు ఆడినా ఆవేదన అణుచుకుంది. పురోహితుడ్ని కబురు పెట్టినప్పటికీ రావడం మానినా ఆఖరికి ఆ వారపు బ్రాహ్మడుకూడా గుమ్మం త్రొక్కడం మానినా సహించింది. హరి పెళ్ళితో సాటివారితో అన్ని విధాల సంబంధాలు తెగిపోయినా అన్నీ కొడుకు సుఖం కోసం భరించింది. అంతకంటె తక్కువగా కోడలికోసం తన ఆచారాలు వదులుకోడం ఆమె శక్యం కాలేదు. చూస్తూ చూస్తూ అంత అనాచారానికి ఒక్కసారిగా తను మాత్రం ఎలా దిగజారిపోతుంది!

అందుకే యింట్లో దినదినగండం అనిపించసాగింది ఆమెకి. కొడుకూ కోడలు ఆస్పత్రికి వెళ్ళాక స్నానంచేసి వాళ్ళు వచ్చేలోపల వంట, పూజ అదీ ముగించుకుని వాళ్ళకి భోజనం విడిగా బల్లమీద అమర్చేది. ఒంటిగంటకి వాళ్ళు భోజనంచేశాక వంటగదిలో తలుపులు వేసేసి యింక భోజనం చేసేది.

తల్లి చాదస్తానికి, మూఢత్వానికి హరి ఎన్నిసార్లో విసుక్కునేవాడు. రోజ్ లీ చూసిందని విస్తట్లో పెట్టిన అన్నం తినడం మానుకుందని జ్వరం వచ్చినా కోడలిచేత వచ్చి మంచినీళ్ళుకూడా త్రాగడానికి యిష్టపడ లేదని కోడలిచేత ఏ పని చేయించడానికీ పనికిరాదని — ఎన్నోసార్లు తల్లి మూర్ఖత్వాన్ని, మూఢత్వాన్ని అర్థం పర్థంలేని సనాతనాచారాలని తీవ్రంగా విమర్శించడమేకాక తల్లి, భార్యని చిన్నచూపు చూడడం సహించలేక తల్లి మీద కోపంతెచ్చుకున్న సందర్భాలెన్నో వున్నాయి.

ఈనాటివారిలాగ అంత తేలిగ్గా కులాంతర, మతాంతర వివాహాలని ఆమోదించలేని సావిత్రమ్మ, కొడుకు తనమీద నింద మోపడం సహించలేకపోయింది.

తన నిష్ఠ నియమాలకి దూరం కావడంకంటె కొడుక్కి దూరమై అన్నగారి పంచన చేరడానికైనా సిద్ధపడింది ఆమె. అర్థంలేని మమతలకు లొంగి తను, తన మూలంగా వాళ్ళు బాధపడడంకంటె యిక్కడుండక పోవడం మంచిది. కొడుకు పెద్దవాడయ్యాడు. కోడలొచ్చింది. తను లేకపోయినా వాళ్ళయిల్లు వాళ్ళు చక్కదిద్దుకోగలరు. చూడాలనిపించినపుడు

ఓ పూట వచ్చి చూసి వెళ్ళొచ్చు అనవసరంగా బాధపడుతూ దినదినగండంలా రోజులు వెళ్ళబుచ్చడం ఎందుకో? నిశ్చయించుకుంది సావిత్రమ్మ చాలారోజులు అయ్యాక.

ఆమె నిశ్చయాన్ని హరి ఒక్కమాటలో తేలగొట్టేశాడు. వీళ్ళ పంచన పడుండడానికి కొడుకు చచ్చాడనుకుంటే అలాగే వెళ్ళు. రోజ్‌లీని పెళ్ళాడినదానికి శిక్షగా కక్ష సాధించాలనివుంటే వెళ్లు అని తల్లికి మరి మాటాడడానికి అవకాశం ఈయలేదు.

రోజులు గడపక తప్పలేదు సావిత్రమ్మకి.

* * *

ఏడాది గిర్రున తిరిగే సరికి పండంటి మనవణ్ని అందించింది సావిత్రమ్మకి రోజ్‌లీ. తల్లి రంగుతో, తండ్రి పోలికలతో, ఆరోగ్య సూత్రాలు అక్షరాలా పాటించిన తల్లికి పుట్టిన బిడ్డ—ఎంతో ఆరోగ్యంగా ముద్దువచ్చే మనవడు ఆమెకి సంతోషంతోపాటు మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టాడు. హరి తర్వాత పాతికేళ్ళకి యింట్లో చంటివాడు ...

తమ వంశాంకురం తమ రక్తం పంచుకు పుట్టిన బిడ్డ రక్తంలో యింకోజాతి రక్తం కలిసిందన్న సత్యం అనుక్షణం గుర్తువచ్చేది సావిత్రమ్మకు. ఆ మనవడు యింకోజాతి తల్లికి పుట్టినవాడన్న బాధ ఆమెని వదిలేదికాదు. "ఛ పసివాడికి జాతి, మతం ఏమిటి? అని ఎంత నచ్చచెప్పుకున్నా—ఆమె పుట్టిపెరిగిన, మసలిన వాతావరణం ఆమెని అంత తేలిగ్గా నమ్మించలేకపోయేది.

అయినా పసివాడి బోసినవ్వులకి, మునవడి ఆటపాటలు చూస్తూ దగ్గరకి తీయకుండా రక్తసంబంధం ఎలా వూరుకుంటుంది? పసివాడి పాల బుగ్గలు ముద్దుపెట్టుకోవాలన్న కాంక్ష ఎలా అరికట్ట లేకపోయేదో అలాగే వాడిని ఎత్తుకున్నాక వాడి చొంగనోటితో తన బుగ్గలు తడిశాక ఏదో జుగుప్స కలిగి గబగబ నోరు పుక్కిలించి కడుక్కునేది.

ఇంట్లో పెద్దదిక్కుగా కోడలు చంటివాడికి ఉగ్గుపట్టమని వళ్ళు కాచమని నీళ్ళుపోయమని అడిగితే ఎలా కాదనగలదు అలా అంటీఅంట నట్టు ఎలావూరుకోగలదు. కోడలు ఆస్పత్రికి వెళ్ళాక ఆయాచేతిలో సలువక ఒకోసారి గుక్కపట్టి ఏడ్చే మనవడిని ఎత్తుకుని సముదాయించ కుండా ఎలా వూరుకోగలదు? మామ్మచేతిలోకి రాగానే ఆమె చేతుల్లో నిద్రపోయే మనవడిని పడుకోబెట్టి మళ్ళీ స్నానంచేసి మడిగట్టుకునేది. ఆయా పాలుపడితే త్రాగకుండా ఏడ్చే మనవడిని తననికాదన్నట్లు ఎలా వూరుకోనిస్తుంది రక్తసంబంధం? ఆ కూరగిన్నె దింపి మనివడికి పాలుపట్టి పడుకోబెట్టి స్నానంచేసేది సావిత్రమ్మ. అదే హరి చిన్నప్పుడు అయితే బట్టలు విప్పేస్తే తన మడికి ఆచారానికి సరిపోయేది. కాని—యిప్పుడు హరీ రోజ్‌లీ కొడుకు ఒకటేనా? అనుకునేది సావిత్రమ్మ.

తల్లి యింటిలో లేకపోవడంతో మామ్మదగ్గిర చేరికఅయి బోసి నవ్వులతో పలకరించే మనవడిని గున గున పాకివచ్చి చేతులందిచే మనవ డిని చేరదీయకుండా వుండగలిగే నిగ్రహం ఎలా చూపలేదో అలాగే, ఆ మనవడిని ముద్దులాడాక స్నానం చేయాలన్న ఊహని అరికట్టేంత విగ్ర హమూ వుండేదికాదు ఆమెలో.

మమతాను రాగాలకి, నిష్ఠ నియమాలకి మధ్య నలిగిపోతూ రోజుకి పదిసార్లు స్నానాలు చేస్తూ తన ఆచారం కాపాడుకోడానికి నానా యాతన పడుతున్నా తనలో మార్పురావాలని మాత్రం అనుకోలేక పోయింది సావిత్రమ్మ.

ఈ కాలం వారిలాగ ఈ వర్ణాంతర, కులాంతర వివాహాలని ఆమో దించేటంత సంస్కారము అంత తేలిగ్గా ఈ విషయాలని తీసుకునేటంత నాగరికత ఆమెకు లేవు.

ఇన్నాళ్ళ యిబ్బందులు ఒక ఎత్తు! మనవడు ఏడాదివాడయ్యాక ఇంకో కొత్త యిబ్బంది వచ్చి పడింది సావిత్రమ్మకి. రోజ్‌లీ హాస్పిటల్ వెడ్తుంది కనుక పగలు మనవడికి అన్నం పెట్టే పని సావిత్రమ్మ మీద పడింది. నీ కొడుక్కి అన్నంపెడితే నేను మైలపడతాను. నాకు పనికి

రాదు .. వాడికి అన్నం పెడితే ఆచేత్తో దేముడికి నైవేద్యం ఎలా పెట్టను? అంటచేత్తో వాడిని ముట్టుకుంటే నా ఆచారం మంట గలుస్తుంది" అని ఏ తల్లి అయినా కొడుక్కి ఎలా చెప్పగలదు. అక్కడికీ "ఆవేళకి మడి గట్టుకుంటాను ఎలారా." అని నెమ్మదిగా గొణిగింది హరి దగ్గర సావిత్రమ్మ.

" మడి. వాడికీ మడిగట్టేయ్ ...గుడ్డలు విప్పేస్తే మడికి సరిపోతాడుగా, అలా పీకలవాపేగా .. పోనీ కొడుక్కి లేకపోయినా మనవడికేనా నీ ఆచారాలు నేర్పు " తేలిగ్గా నవ్వుతూ అనేశాడు హరి. యింకేమంటుంది సావిత్రమ్మ.

అన్నం ఉడికించి నెయ్యి చారువేసి మెత్తగా కలిపి ఓ గిన్నెలో చంచా పెట్టి ఆయాచేత మనవడికి పెట్టించేది సావిత్రమ్మ ఆయాచేత తినకుండా అంటుమూతితో తనదగ్గరకి పరిగెత్తుకు వచ్చే మనవడిని తప్పించుకుంటూ, వాడికి మురిపింతలు పెడ్తూ వాడికి అన్నం పెట్టించడం రోజూకో యజ్ఞంచేసినంత పని అయ్యేది ఆమెకి. తరువాత స్నానం చేసి మడి గట్టుకునేది.

ఒకరోజు వంట్లో బాగులేక హరి వెళ్ళిన రెండు గంటలకే యింటికి వచ్చేశాడు. యింట్లో ఆయా చేతికి అందకుండా అన్నం తినకుండా మురాయిస్తున్న కొడుకు కంట బడ్డాడు. అప్పుడే సావిత్రమ్మ ఎందుకో వంటయింట్లోకి వెళ్ళింది. హరి ఆశ్చర్యంగా చూసి ఆయాని నీవెందుకు పెడ్తున్నావు అన్నం అమ్మ ఏమయింది అనడిగాడు రోజూ నేనే పెట్టున్నాను బాబూ. అమ్మగారికి మడిగదా అంది. ఆ ఒక్క మాటతో అంతా అర్థం అయింది హరికి. మాట్లాడకుండా ఆయా చేతిలో గిన్నె అందుకుని కొడుక్కి అన్నం తినిపించడం మొదలుపెట్టాడు. కొడుకు అడగడం ఆయా జవాబులు విని హఠాత్తుగా ఎదురయిన పరిస్థితికి కొడుక్కి మొహం చూపలేక సిగ్గుతో వంటింట్లో గోడకి అంటిపెట్టుకుని వుండిపోయింది సావిత్రమ్మ. దోషిలా నెమ్మదిగా బయటికి వచ్చి నిల్చున్నా హరి కళ్ళెత్తి తల్లిని చూడలేదు.మాట్లాడలేదు.

హరికి పిల్లవాడి బాధ్యత పనివాళ్ళమీద వదలడం ఇష్టంలేదు. వాడిపనులు రోజ్‌లీనో, తల్లో చేయాలంటాడు. పాలుపట్టడం, నీళ్ళు, అన్నం అన్నీ పనివాళ్ళచేత చేయించడం కొడుక్కి యిష్టంలేదని ఆమెకి తెలుసు.

"అన్నం కలిపిచ్చి ఆయాచేత సరిగా పెట్టిస్తున్నాను హరీ" అని గొణిగింది. నిన్ను నేనేం అనలేదమ్మా. నీ తప్పు ఏంలేదు. నీ సంగతి తెలిసి, వాడి బాధ్యత నీమీద పెట్టడం మాదే తప్పు. పసివాడికి కూడా జాతి, మత భేదాలు అంటగట్టావని ఊహించక పోవడం నాదే తప్పు ... వాడు రోజ్‌లీ కొడుకుమాత్రమే కాదు, నా కొడుకు కూడాను ...ఆ సంగతి నీవు మరచినా నేను ఎలా మరచిపోతాను?" అంతకన్న ఏం అనలేదు హరి, కొడుక్కి అన్నంపెట్టి మూతికడిగి గదిలోకి తీసుకువెళ్ళిపోయాడు.

సావిత్రమ్మ యిస్తున్న సంజాయిషీలు వినిపించుకోలేదు. మధ్యాహ్నం రోజ్‌లీతో అన్నాడు. "రోజ్. నీవు యింక ఉద్యోగం చేయవద్దు బాబుకంటె నీ సంపాదన ముఖ్యం కాదు. తల్లీ తండ్రి వుండి యింకోళ్ళని నమ్మి బాబుకి అన్యాయం చేయవద్దు" సావిత్రమ్మకి తలకొట్టేసి నట్లయింది. ఆ అవమానం సహించలేక రాత్రంతా కుళ్ళి కుళ్ళి ఏడ్చింది.

"తను పసివాడిని సరిగా చూడడంలేదూ? తను మాత్రం ఓ తల్లి గాదూ? తనకి వాడంటే అభిమానంలేదూ?" అంతేకాక ఆ మర్నాటి నుంచి హరి యింట్లో తల్లి ఉనికినే మరచినట్లు ప్రవర్తించ సాగాడు. అఖరికి మనవడిని ఆమె దగ్గరికి వెళ్ళకుండా కట్టడిచేయడం సహించలేక పోయింది సావిత్రమ్మ. అలవాటయిన మనువడు మామ్మ దగ్గరికి వెళ్తా నని మారాం చేస్తుంటే హరి గదమాయించడం స్పష్టంగా వింది సావి త్రమ్మ. "తనేం నేరం చేసిందని పసివాడిని కూడా దగ్గరకు రానీయకుండ శిక్షిస్తున్నాడు కొడుకు." కుమిలి ఏడ్చింది సావిత్రమ్మ. కొడుకు దృష్టిలో ఎంత చులకన, హీనమయింది తను. ఎంత ఏహ్యించు కుంటున్నాడు కన్న కొడుకే శత్రువయినప్పుడు. యింకా ఎవరికోసం యీ యింట్లో ఉండడం.

యిటు ఆచారాలని వదలుకోలేని బలహీనత, అటు కొడుకుకు దూరంకాలేని మమతానురాగాలకి మధ్య కాసేపు ఊగిసలాడినా ఆఖరికి సావిత్రమ్మ తీర్థయాత్రల పేర ఆ యిల్లు వదలివేయడానికి నిశ్చయించుకుంది. ఈ సారి హరి ఏ అభ్యంతరము చెప్పకుండా వూరుకున్నాడు. తల్లి పయాణం ఏర్పాటులు చేశాడు ఆమె కోరికమీద. ఏ కాశీకో వెళ్ళి అక్కడే వుండిపోవాలని నిశ్చయించుకుంది మనస్సులో సావిత్రమ్మ. కొడుకుతో ఆ మాట చెప్పలేదు. భర్త ఆమె తిండి బట్టకు లోటులేకుండా ఏర్పాటు చేసిన డబ్బు నెలనెలా తనకి పంపే ఏర్పాటు చేసుకుని మంచి రోజుచూసి బయలుదేరింది సావిత్రమ్మ.

పుణ్యక్షేత్రాలన్నీ దర్శించింది తృప్తిగా రెండునెలలు సావిత్రమ్మ, ఆఖరికి ఒక తెలుగు కుటుంబంతో పరిచయమయి వాళ్ళు హరిద్వారంలో ఎవరో గొప్ప స్వాములవారున్నారని దర్శించడానికి బయలుదేరుతూంటే వారితో పాటు ఆమెకూడా హరిద్వారం వెళ్ళింది.

హరిద్వారం నిండా ఎంతోమంది స్వాములు చిన్న చిన్న పర్ణశాలలు చిన్న చిన్న ఆశ్రమాలు ఏర్పరచుకొని వున్నారు. వారిని సేవించే శిష్యకోటి వారిని దర్శించేభక్తకోటి కూడా చాలా మంది వున్నారు.

వారందరిలో పేరున్న స్వామి నిత్యానంద స్వామి. ఆయన మహిమల గురించి, ఆయన తపశ్శక్తిని గురించి ఎంతో గొప్పగా చెపుతారు, చెప్పుకుంటారు అక్కడ ప్రజలు, ఆయన్ని దర్శించడానికి ఎంతో మంది ప్రజలు తీర్థయాత్రికులులాగ వస్తారు.

ఆయనని చూస్తేనే ఏదో భక్తిభావం గోచరిస్తుంది. ఆయన వరాలివ్వడు. ప్రజలు చెప్పుకునేదంతా ఓపిగ్గా చిరునవ్వుతో వింటాడు. ఇది చేస్తాను, అది చేస్తానని వాగ్దానాలు యీయడు, జబ్బులు పోగొడ్తానని చెప్పడు, అసలు ఆయన ఎవరికి ఏం చెప్పడు. ప్రజలు భక్తితో నమస్కరిస్తే చేయెత్తి ఆశీర్వదిస్తాడు. కోరినవారికి ఆయన కమండలంలోని తీర్థం యిస్తాడు, అంతే. అంతకంటే ఏం చెయ్యడు. కాని ప్రజలకి ఆయనమీద ఏదో విశ్వాసం, ఆయన దర్శనంతోనే పునీతమైనట్లు ఆయన తీర్థం

తోనే వారివారి కోరికలు తీరిపోయినట్లు భావిస్తారు. అంతటి అచంచల విశ్వాసం కలిగిస్తుంది. ఆయన మొహంలోని తేజస్సు, ఆజానుబాహువు, చామనచాయ రంగు, కోటేరేసిన ముక్కు, వత్తుగా పెరిగిన తెల్లని గడ్డం, మొహంలో బ్రహ్మతేజస్సు, నుదుట విభూతి, చేతిలో రుద్రాక్షమాల, పద్మాసనం వేసుకుని కళ్ళుమూసుకుని ధ్యానించే ఆయన్ని చూస్తే ప్రణమిల్లక వుండలేరు ఎవరూ. ఆయన పూర్వాశ్రమంలో బాగా చదువుకున్న వాడంటారు. ఎందుకో విరక్తి కలిగి సన్యసించాడట. పదేళ్ళు పూర్తిగా మౌనవ్రతంలో తపస్సు చేశాడంటారు.

సావిత్రమ్మకి ఆ స్వామిని చూసిన వెంటనే ఎంతో పూజ్యాభావం కలిగింది. ఆయన మొహంలోని తేజస్సు, ఆయనలోని నిర్మలత్వం ఆమెకి స్వామిపట్ల పూజ్యభావం కలిగింది. ఆయని సమక్షంలో, ఆయన ఆశ్రమంలో వున్నంతసేపు అమె మనసు ఎంతో నిర్మలంగా వుండేది. అచోట ఏదో ప్రశాంతత కనపడింది ఆమెకి. స్వామిని సేవిస్తూ ఎంతో మంది శిష్యకోటి అక్కడ వున్నారు. ఇలాంటి ప్రశాంతకరమైన చోట తను జీవితం గడిపితే స్వామి సన్నిధిని తన చివరిరోజులు ప్రశాంతంగా వెళ్ళబుచ్చాలన్న కోరిక ఆమెలో కలిగింది. స్వామివారి అనుమతి తీసుకుని అక్కడ తనూ ఓ ఆశ్రమవాసిగా వుండిపోవాలి. అక్కడకు వెళ్ళిన తర్వాత ఆ అభిప్రాయం ఆమెలో చోటుచేసుకుని రోజు రోజుకి అది బలపడింది.

వచ్చిన ఇరవై రోజులకు ఓరోజు స్వాముల వారికి నమస్కరించి ఏదో చెప్పడానికి ఉద్యుక్తురాలయి సందేహిస్తున్న ఆమెని ఆయన చిరునవ్వుతో సాదరంగా ప్రశ్నించారు. అప్పటికే ప్రతిరోజు కొన్ని గంటలు తన సన్నిధిలో ఆమె గడపడం, తను చెప్పే హితోక్తులు భక్తిగా. శ్రద్ధగా వినడం ఆయన గమనించారు.

సందేహిస్తూనే ఆమె తన మనసులోని కోరిక వెల్లడించింది. విని ఆయన కాస్త ఆశ్చర్యపోయినట్లు కనిపించారు. "నీ కిలాంటి కోరిక ఎందుకు కలిగిందమ్మా, నీకు నీవారు ఎవరూ లేరా,.... ఏకాకివిఅవా ?"

ప్రశ్నించారు. జవాబు చెప్పడానికి సావిత్రమ్మ కాస్త తడబడింది.... వున్నారు స్వామి .. కాని నా ఉనికి నా అవసరం మాత్రం ఎవరికీ లేదని చెప్పగలను। నా బరువులు, బాధ్యతలు తీరిపోయాయి. ఈ చివరి రోజులు మీ సన్నిధిని ప్రశాంతంగా గడపాలన్న కోరికగా వుంది. కాదనకండి స్వామీ !" ప్రాధేయపడినట్లు అడిగింది. "కాదనడానికి అవుననడానికి నాదే ముందమ్మా. కాని ఇహలోక చింతలకి దూరమయ్యేటంత విరక్తి ఎందుకు కలిగింది. చెప్పగలవా"?

సావిత్రమ్మ తలవంచుకుని తన కథ అంతా చెప్పింది. అది విని చిరునవ్వు నవ్వారు స్వాము, "ఈమాత్రందానికేనా అమ్మా కన్న కొడుకు మీద మమతానురాగాలు దూరం చేసుకోవాలనుకుంటున్నావు." ఆమె ఆశ్చర్యంగా చూసింది ఆయనమాట అర్థం కానట్టు, తపశ్శాలి బ్రహ్మ తేజస్సు మూర్తీభవించినట్టున్న ఆయన జాతి మతాలను అంత తేలిగ్గా జమ కట్టి మాట్లాడడం చూసి, ఆశ్చర్యపోయింది. "చూడమ్మా, నీవు ఏదైతే పవిత్ర తీర్థమని నా చేతిమీదుగా ఇన్నాళ్ళు పుచ్చుకొంటున్నావో ఆ తీర్థం ఒక అంటరాని వాడిచేతినుంచి వచ్చినదే అమ్మా .. యిలాంటి అంటరాని వాడిదగ్గర నీవు యిక్కడ ఎలా ఉండగలవమ్మా" చిరునవ్వుతో అన్నారు స్వామి.

నిర్ఘాంతపోయింది. సావిత్రమ్మ "స్వామీ !" అంతకంటె మాట్లాడలేదు.

"అవునమ్మా నేను హరిజనుణ్ణి.... నా యీ తీర్థం పవిత్రమైంది అయినప్పుడు నీవు నీ కోడలు, మనవడిని మనసారా అంగీకరించక పోవడంలో నాకేం అర్థం కిసబడడంలేదు !" సావిత్రమ్మ తల తిరిగిపోయింది. ఇన్నాళ్ళు ఎంతో భక్తిభావంతో, పవిత్రభావంతో, పూజ్యభావంతో, సేవిస్తున్న స్వామి ఒక అంటరాని జాతివాడా, నమ్మలేకపోయింది.

'నమ్మలేవా .... పూర్వాశ్రమంలో నేను హరిజనుణ్ణి, నేనూ ఈ కులమత భేదాలవల్ల ఎంతో నలిగిన వాడినే తల్లీ . అంటరానివాణ్ణని

ఒకనాడు నన్ను అందరూ ఎంత హీనంగా చూశారో నీకు తెలియదు. ఆ ప్రజలే ఈ నాడు నన్ను ఓ దేముడిలా కొలుస్తున్నారు. నేను గడ్డాలు మీసాలు పెంచి కాషాయగుడ్డలు కట్టుకోగానే, నాకు ప్రాపంచిక విషయాలమీద విరక్తి కలిగి సన్యసించాను సావిత్రమ్మ నోరుతెరచి ఆయన చెప్పినదంతా వినడం మినహా ఏం అనలేకపోయింది.

"చూడమ్మా! ఈ జాతి మత భేదాలు దేవుడు సృష్టించలేదు. యిది మానవ సృష్టి దేముడికి అందరూ సమానులే. అందరూ అతని బిడ్డలే. యిందుకే అతనికి అంటరానివాళ్ళు లేరు. ఈ సత్యం తెలుసుకో! అనవసరంగా ఈ జాతి మతాలకి ప్రత్యేకత ఇచ్చి కన్న కొడుకుకి, ఎంతో సౌమ్యురాలయిన కోడలికి, పండంటి మనవడికి ఎందుకు దూరమవుతావు నీ రాకకోసం ఎంతో ఆత్రుతగా చూస్తుంటారు వాళ్ళు. వెళ్ళి సుఖంగా ఉండవమ్మా ఈ ఆశ్రమాలలో స్త్రీలుండడం కష్టం వెళ్ళమ్మా వెళ్ళి వెంటనే నీ శేషజీవితం భగవంతుని ధ్యానంలోనూ నీ వారి ఆనందంకోసం వెళ్ళబుచ్చు" స్వామి తను చెప్పవలసింది ఇంకేమీ లేదన్నట్టు కళ్ళు మూసుకున్నారు. ఆమె సమస్యకి పరిష్కారం దొరికినట్లయింది ఆ క్షణమే.

* * *

ఉత్తరమన్నా లేకుండా రైలుదిగి మూటాముల్లెతో వచ్చేసిన అత్తగారిని-మళ్ళీ తిరిగిరాదనుకున్న అత్తగారిని-గుమ్మంలోనే ఆశ్చర్యంగా చూస్తూ నిల్చింది రోజ్ లీ.

సామాన్లు లోపలపెట్టిస్తూ "కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టమ్మా రోజా ... బాబీగాడేడీ ...." అంటూ లోపల్నుంచి బంతితో ఆడుకుంటూ వస్తున్న మనవణ్ణి గభాలున ఎత్తుకుని మనసారా ముద్దు పెట్టుకుంది సావిత్రమ్మ.

ఆ రోజుతో జాతి మత భేదాలనించి విముక్తి పొందింది సావిత్రమ్మ.